# బ్యాంక్ దోపిడీ - మెథడ్ నెంబర్ త్రీ

'క్రైమ్ అండ్ డిటెక్షన్' పత్రిక అసిస్టెంట్ ఎడిటర్ సుజాత తన టేబుల్‌పై ఉన్న కథను పరిశీలనగా చూసింది. రెండు విషయాలు ఆమె దృష్టిని ఆకర్షించాయి - మొదటిది ఆ కథ పేరు 'బాంక్‌ను దోచే మూడు మార్గాలు - మొదటి మార్గం'. రెండవది రచయిత పేరు - ఘనం శీతారామయ్య. పాతరకం వింత పేరు. ఆంధ్రదేశంలో ఉన్న క్రైమ్ రచయితలందరి పేర్లూ నాలిక చివర వుండే సుజాతకు కూడా ఆ పేరు కొత్తగా ఉంది.

కవరింగ్ లెటర్లో మధ్య పేరా కూడా కాస్త ప్రత్యేకంగా ఉంది. - 'కథ టైటిల్ మీకు సరైనదిగా తోచకపోవచ్చు. ఎందుకంటే దీనిలో హీరో విహారి అవలంబించిన పద్ధతి దోపిడీ కాదు. ఇంచుమించు చట్టబద్ధంగానే - సంపాదిస్తాడు. రెండో కథ కూడా రాస్తున్నాను. ఆ కథ రాయడం పూర్తి కాగానే పంపిస్తాను. దీనిలో రాసిన టెక్నిక్ గురించి మీకేవైనా సందేహాలుంటే మీ బాంక్ వాళ్లని అడిగి నిర్ధారించుకోగోర్తాను.'

కథ రాసిన విధానం మాత్రం ఏమీ బాగాలేదు. పాత్ర చిత్రణ, సన్నివేశ కల్పన సరిగా కుదరలేదు. దోపిడీ మార్గం గురించి వివరించిన వ్యాసంలా ఉంది. అక్కౌంటులో బాలన్స్ లేకపోయినా కస్టమర్ చెక్ ఇచ్చినప్పుడు బాంక్ కంప్యూటరే ఓవర్‌డ్రాఫ్ట్ ఇచ్చి దాన్ని పాస్ చేసే సౌకర్యంలో ఉన్న లొసుగుల గురించి విమర్శ ఎక్కుపెట్టినట్లుంది.

కథ తిప్పి పంపేస్తే పోలా? అనుకుంది సుజాత. కానీ ఆ దోచుకునే పద్ధతి గురించి రచయితకున్న నమ్మకం మాత్రం ఆమెను కలవరపరచింది. ఎడిటర్ నెత్తినే ఈ బాధ్యత పడేస్తే మంచిదనుకుని ఆయన ట్రేలో పెట్టేసింది. మర్నాటికల్లా ఆయన రిమార్కు కనబడింది - "కథ పరమచెత్తగా ఉంది. కానీ దోపిడీ విధానం చూడబోతే నిజంగా జరిగేట్టుగానే ఉంది. ప్రతాపరావు గార్ని అడిగి చూడకూడదూ?"

వాళ్ల పబ్లికేషన్ గ్రూపుకి అప్పిచ్చిన జనతా బ్యాంక్ వైస్ ఛైర్మన్ ప్రతాపరావు. ఆయన ఈ కథ చదువుతూనే పాలిపోయాడు. "ఈ పద్ధతి ప్రకారం బాంక్‌ను మోసగించవచ్చంటారా?" అని అడిగింది సుజాత.

"ఏమో, మా క్రెడిట్ డిపార్ట్‌మెంట్ వాళ్ల నడిగితే కరక్టుగా చెప్తారు" అంటూనే పెదాలు కొరుక్కుని, "ఆలోచిస్తూంటే ఇది సాధ్యమేననిపిస్తోంది. జనాలు ఇలా చేస్తే మా బాంక్ మునగడం ఖాయం. అవునూ.. ఇది మీ పత్రికలో ప్రచురణ కోసం వచ్చిందన్నావు కదూ? మీరు దీన్ని వేయడం లేదు కదా, ఇది కనక ప్రజల చేతుల్లో పడిందంటే... అంతే సంగతులు." అన్నాడాయన ఖంగారు పడుతూ.

సుజాత కసలే బాంక్ వాళ్లంటే మహా చిరాకు. స్కూటర్ లోను ఇమ్మంటే మహా బెట్టు చేసాడీయన. "వేయాలో, అక్కర్లేదో ఇంకా తేల్చుకోలేదు లెండి." అంది ఎటూ తేల్చకుండా.

ప్రతాపరావు కళ్లజోడు తీసి టేబుల్ మీద పెట్టి, నుదురు తుడుచుకున్నాడు. "వాడి దగ్గర ఇంకో కథ కూడా ఉందంటున్నాడు. దానిలో కూడా ఇలాగే మరో విధానం గురించి రాస్తే బాంకింగ్ వ్యవస్థ కుప్పకూలిపోతుంది."

"డబ్బు టూది పవర్ ఆఫ్ డబ్బు చదివి ఎంతమంది డబ్బు సంపాదించారు లెండి. ఖంగారెందుకు? జనాలు సరదాకు చదువుతారు, పోనీండి." అంది సుజాత వెక్కిరింతగా.

"భలే దానివి. దీనిలో రాసిన పద్ధతి వాటి కంటే డేంజరస్. పైగా ఇంకో విషయం ఆలోచించు. మూడు మార్గాలంటున్నాడు. అంటే మూడోది కూడా తోడయితే ఇక చెప్పక్కర్లేదు. మా బాంక్ స్టాఫ్ కాస్త నిర్లక్ష్యంగా ఉన్నారంటే చాలు, మొత్తం లూటీయే. అమ్మో, ఇది అచ్చేయడానికి వీల్లేదు. అసలు ఈ మనిషెవరో ముందతన్ని చూడాలి. అతన్నోసారి మీ ఆఫీసుకి రమ్మనండి." అన్నాడు ప్రతాపరావు అధికారం ఉట్టిపడుతూండగా.

సుజాతకు ఒళ్లు మండింది. "దాని గురించి నిర్ణయించేది మేము, మీరు కాదు." అంది మొహం చిట్లించుకుని. ప్రతాపరావు ఖంగు తిన్నాడు. సుజాతను బతిమాలి ఆ కథను తన ఆఫీసుకి తీసుకెళ్లడానికి, ఆమెను ఒప్పించడానికి తాతలు దిగొచ్చారతనికి.

సాయంత్రానికి అతని వద్దనుంచి ఫోన్ వచ్చింది. – "మేం ఎమర్జన్సీ మీటింగ్ పెట్టుకుని దాని గురించి చర్చించుకున్నాం. క్రెడిట్ డిపార్ట్‌మెంట్ వాళ్లు అనేదేమిటంటే, కథలో రాసిన మొదటి మార్గం రమారమీగా చట్టబద్ధమే కానీ కొన్ని పాయింట్లు పట్టుకుని మేం దాన్ని కోర్టులో ఎదుర్కొని వాళ్లకు శిక్ష వేయించగలం. కానీ దానివల్ల బోల్డంత ఖర్చవుతుంది. అందువల్ల, మీరేం చేస్తారంటే – మీ ఎడిటర్ గారితో కూడా మాట్లాడుతానులే – ఆ కథ మీరు కాపీరైట్‌తో సహా కొనేసి, మా కమ్మేయండి. అప్పుడు అతను వేరెవరికీ ఆ కథ అమ్మలేడు. ఒకే?"

"ఈ కథ అమ్మలేడు కానీ ఈ టెక్నిక్‌తో వేరే కథ రాయకూడదని లేదుగా. పైగా కథ ప్రచురించే ఉద్దేశ్యం లేనప్పుడు మేమెందుకు కొనాలి?" సుజాతకు బాంక్ వాళ్లమీద మంట ఇంకా తగ్గలేదు.

కానీ విషయం అంతటితో ఆగలేదు. బాంకర్స్ అసోసియేషన్ వాళ్లు అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడం, దానికి పబ్లిషరును, ఎడిటర్‌ను, సుజాతను పిలిపించడం జరిగింది. దేశం ఆర్థికంగా బాగుండాలంటే శీతారామయ్య కథను కొనేయ్యాలని, కొని ఓ మూల పడేయాలనీ నిర్ణయించడం జరిగింది. కానీ ఎంతకు కొనాలన్నదే చర్చనీయాంశం అయింది. "మామూలుగా కథ కెంత ఇస్తారు, సుజాతా?" అని అడిగాడు గుంటనక్కలా కనబడే ఓ ముసలాయన. ఆయనో కోపరేటివ్ బాంక్‌కి ఛైర్మన్. శీతారామయ్య పేరున్న రచయిత కాదు కాబట్టి, ఇదే అతని ప్రథమ రచన కాబట్టి మామూలుగా తాము అలాటి వాళ్లకి ఎంత పారితోషికం ఇస్తామో చెప్పింది సుజాత. చెప్తూనే "దానికంటే కాస్త ఎక్కువ ఇస్తానంటే సరి" అని చేర్చింది.

"చూడమ్మా, మా కా డబ్బు ఒట్టి వృథా ఖర్చు కిందే లెక్క. ఆ కథను ఎక్కడా ప్రచురించబోడం లేదు కదా, పైగా రెండో విధానం, మూడో విధానం కథలు కూడా కొనాలి. ఇంకా ఇలాటి కథలు రాసేస్తే అవీ కొనాలి. అందువల్ల అదనంగా ఏమీ ఇవ్వక్కర్లేదు. మామూలుగా ఇచ్చే రేటు ఇస్తే చాలు." అన్నాడాయన.

సుజాతకేం పోయింది? వాళ్లు చెప్పినట్లు వంద రూపాయలకు చెక్కు రాసి దాంతో బాటు ఓ ఉత్తరం కూడా జతపరిచి రచయితకు పంపింది. 'మీ కథకు పారితోషికంగా ఇది పంపిస్తున్నాం. ఎడిటరు గారు రెండవ, మూడవ విధానాల కథలు కూడా చూడాలని ఉబలాటపడుతున్నారు. త్వరలో పంపగలరు. అవి కూడా మా చేతికి వచ్చిన తర్వాత ఎప్పుడు ప్రచురించాలో ఆయన నిర్ణయిస్తారు.' అని రాసింది ఉత్తరంలో. ఆ ఉత్తరం పంపేటప్పుడామెకు 'అయ్యో పాపం రచయిత' అనిపించింది. ఒక ఔత్సాహిక రచయితకు తన పేరు అచ్చులో చూసుకోవడం కంటే సంతోషాన్ని కలిగించేది మరోటి ఉండదు. ఇంత చిన్న మొత్తం ఇచ్చి ఆ సంతోషాన్ని దోచుకోవడం అన్యాయమనిపించిందామెకు.

ఒక వారం తర్వాత 'బాంక్‌ను దోచే మూడు మార్గాలు – రెండవ మార్గం' అనే కథ చేరింది. యథా ప్రకారం కథ, కథనం అధ్వాన్నంగా ఉంది కానీ దానిలో వర్ణించిన విధానం మాత్రం చాలా కన్విన్సింగ్‌గా ఉంది. కంప్యూటర్ బాంకింగ్‌లో ఉపయోగించే మాగ్నటిక్ ఇంక్, డాటా ప్రాసెసింగ్ నేపథ్యంలో బాంక్‌ను ఎలా మోసగించవచ్చో విపులంగా రాసి ఉంది. ఎడిటర్ గారు ముందే చెప్పి

వుంచడం వల్ల కథ వస్తూనే సుజాత ప్రతాపరావును కలిసి ఆయనకు కథ చూపించింది. ఆయన ఏకబిగిన ఆ కథ చదివేసి, గుటకలు మింగి "వీడు అసాధ్యుడు. బాంకింగ్ ఫీల్డు ఔపోసన పట్టేశాడు. వాడి బాక్‌గ్రౌండు అలాటిది..." అంటూ అబ్బురపడుతూండగా సుజాత అడ్డుపడింది. "అతని బాక్‌గ్రౌండ్ మీకెలా తెలుసు?" అంటూ.

"అతని మీద నిఘా వేయడానికి డిటెక్టివ్ ఏజన్సీను నియమించాంగా! అతనికి నేరచరిత్ర ఏమీ లేదు కానీ..."

"అంటే మా పత్రికకు కథ పంపిన పాపానికి మీరతని మీద నిఘా పెట్టి..."

"సుజాతా, అంత సెంటిమెంటల్‌గా మాట్లాడకు. కథలో వాడు చూపించిన అతి తెలివి చూస్తే అనుమానం వచ్చింది. 'వీడు కథలు రాయడమే కాక, ఆ తెలివిని ప్రాక్టికల్‌గా కూడా ఉపయోగిస్తున్నాడా' అని. చెక్ చేయించడంలో తప్పులేదు కదా. ఈ శీతారామయ్య గుడివాడలోనో, గుంటూరులోనో కోపరేటివ్ బాంక్‌లో చాలాకాలం పనిచేసేడటలే. క్రితం ఏడాది బాంక్ ఛైర్మన్ గారి మేనల్లుడికి ఉద్యోగం కావలసి వచ్చి అతన్ని తీసేయాల్సి వచ్చిందట. పెన్షన్ ఇచ్చారటలే. జీతంలో టెన్‌పర్సెంట్..."

"చాలా కాలం అన్నారు, అంటే..."

"ఇరవై ఐదేళ్లో ఎంతో..." కాజువల్‌గా మాట్లాడడానికి ప్రయత్నించాడు ప్రతాపరావు.

"పాతికేళ్లు పనిచేసాక ఇలా ఉద్యోగం పీకిపారేస్తే మీ బాంక్‌వాళ్ల మీద ప్రేమెందుకు ఉంటుందతనికి? అందుకే ఇలాటి కథలు రాస్తున్నాడు. బైదివే, అతను ఓ ఉత్తరం కూడా జతపర్చాడు. రెండో మార్గం కథను కూడా బాంక్ వాళ్లకు చూపించి నిర్ధారించుకోమన్నాడు. మీరు కథ చదివేరుగా. ఈ మార్గం కూడా చట్టబద్ధమైనదేనా?"

"చట్టవిరుద్ధం కాదు. ఈ పద్ధతిని చట్టవిరుద్ధం చేయాలంటే ప్రతీ బాంకూ సిస్టమ్స్, ప్రొసీజర్స్, కొన్ని ఫామ్స్ మార్చాలి. అది కొన్ని నెలలు పడుతుంది. పైగా బోల్డంత ఖర్చు. ఈలోపున జరిగేది జరిగిపోతుంది. మొదటి మార్గం దానికంటే ఇదింకా డేంజరస్."

బాంకర్స్ అసోసియేషన్ సమావేశం ఇంకోసారి జరగడం, దీనికి కూడా పాత కథకు పంపిన మొత్తమే పంపాలని నిర్ణయించడం జరిగింది. "మొదటి కథ విషయంలో ఔత్సాహిక రచయిత కాబట్టి వందే పంపాం. ఇప్పుడు ప్రొఫెషనల్ రచయిత కాబట్టి కాస్త ఎక్కువ పంపుదామా?" అంది సుజాత. "చూడు, కథ ప్రచురించబడితేనే ప్రొఫెషనల్ అవుతారు. అందువల్ల వందరూపాయలు చాలు." అన్నాడు ఆ ముసలి బాంకర్. మూడో మార్గం ఇంకా ప్రమాదకరం అయ్యే సూచన ఉంది కాబట్టి దాన్ని మొగ్గలోనే తుంచేయడానికి గాను అతను కథలు పంపేదాకా కాచుకోకుండా అతన్ని పిలిపించి మాట్లాడాలని నిర్ణయించడం జరిగింది.

"అతను రానంటే?" అంది సుజాత.

"ఎడిటర్ గారితో మాట్లాడి మిగతా కథలు రాద్దువు గాని అంటే ఒక రచయితగా తప్పకుండా వస్తాడు. అతన్ని తీసుకుని బాంకర్స్ అసోసియేషన్‌కి తీసుకువస్తే చాలు. మా లాయర్లు ఉంటారిక్కడ. అతన్ని హడలేసి, మూడో మార్గం కూడా కనుక్కుంటాం. మరీ ఏడిస్తే 'నువ్వు కాగితాలు ఖరాబు చేయక్కర్లేదు, ఇంకో వంద తీసుకో' అంటాం. ఇకపైన కథలు రాయకుండా ఏదో ఒక ఉపాయం ఆలోచిస్తాం." అన్నాడు ప్రతాపరావు మీసం మెలేస్తూ.

వాళ్లందరూ కలిసి శీతారామయ్యను ఒక దొంగలా, మోసగాడిలా చూడడం సుజాతకు నచ్చలేదు. అతని కథ రాగానే తిప్పి పంపేసి ఉంటే బాగుండేదనిపించిందామెకు. కానీ బాంక్ వాళ్లతో ఉన్న మొహమాటాల వల్ల వాళ్లకి చెప్పక తప్పలేదు. శీతారామయ్య రాకపోకల ఖర్చు బాంక్ అసోసియేషన్ వాళ్లు పెట్టుకుంటామన్నారు. ఉత్తరం అందగానే శీతారామయ్య ఫోన్ చేసాడు. "సుజాత గారూ, చాలా థాంక్సండి. రెండు కథలు ఒకేసారి ఆమోదించారంటే చాలా సంతోషంగా ఉంది. మీ బాంక్ వాళ్లకు అవి చూపించారా?... మూడో మార్గం గురించి సందేహం అక్కర్లేదు. అది పూర్తిగా చట్టబద్ధమైనదే.

మీరు పిలిచారు కాబట్టి నేను తప్పకుండా వస్తాను..." అంటూ ఎంతో ఆత్మీయంగా మాట్లాడడంతో సుజాత మరింత కించపడింది.

అతన్ని స్వయంగా చూసినప్పుడు మరింత సిగ్గుపడింది, అలాటి పెద్దమనిషిని దోచుకునే కుట్రలో తానూ పాలుపంచుకుంటున్నందుకు. శీతారామయ్య వయస్సు ఏభై దరిదాపుల్లో ఉంటుంది. తెల్లజుట్టు, ప్రకాశవంతమైన కళ్లు, మధ్యస్థంగా ఉన్న పెర్సనాలిటీ, మర్యాదస్తుడిలా ఉన్నాడు. ఉండబట్టలేక సుజాత ఉన్న విషయమంతా చెప్పేసింది. కథలు బాగాలేవనీ, అచ్చేయబోవటం లేదనీ, బాంకర్స్ అసోసియేషన్ వాళ్లు మూడో కథ రాయకుండా ఉండడానికే డబ్బు ఇస్తున్నారనీ, అన్నీ చెప్పేసింది. అంతా విని, "పోన్లెండి, నా కథలు వేయకపోతే ఆంధ్ర సాహిత్యానికి వచ్చే లోటేమీ లేదు. ఇంతకీ ఆ మీటింగులో ఎవరుంటారు? ఆ గుంటనక్కలా కనబడే ముసలాయన ఉంటాడా?" అని అడిగాడతడు నెమ్మదిగా.

ఉద్యోగధర్మంగా రోజుకి పది డిటెక్టివ్ కథలు చదివే సుజాత కూడా ఈ మలుపు ఊహించలేకపోయింది. "మీ కిదంతా ముందే తెలుసా?" అంది తెల్లబోతూ.

"అంతా కాదు, నా మీద డిటెక్టివ్‌లను నియమించినప్పుడు నేను ప్లాను వేసిన ప్రకారమే కథ నడుస్తోందని ఊహించాను." అన్నాడతను చిరునవ్వు నవ్వుతూ.

సుజాత మొహం ఎర్రబడింది. "వాళ్లు చేసినది మహా తప్పు. ఆ పాపంలో మా పత్రికకు పాలు లేదు సార్. అంతా అయిన తర్వాతే మాకు తెలిసి చాలా బాధపడ్డాం. ఆ మీటింగుకి నేను రాను కూడా. మీ మూడో కథను వాళ్లనే డైరెక్టుగా కొనమనండి." అంది సుజాత కోపంగా.

"మీటింగుకి రమ్మనమని నేను ఆహ్వానిస్తున్నాను. వచ్చి తమాషా చూడండి." అన్నాడతను శాంతంగా.

"మీరు వంద రూపాయలకు కథలమ్ముకోవడం నాకు నచ్చటం లేదు. కనీసం మూడో కథకైనా ఎక్కువ అడుగుతానంటేనే నేను మీతో వస్తాను." అని షరతు పెట్టింది సుజాత.

"నేనూ అదే అనుకుంటున్నాను. మూడో కథ మీద వాళ్లకింత ఇంట్రస్టు ఉంది కదా, ఎక్కువ ఇస్తారనే అనుకుంటున్నాను." అన్నాడు శీతారామయ్య. సుజాతకు అతన్ని చూస్తే అభిమానం కలిగింది. కాఫీకి తీసుకెళ్లింది ఎదురుగా ఉన్న హోటల్‌కి. అక్కడతను తన కథంతా చెప్పుకొచ్చాడు.

"... బాంక్ వాళ్లు నా ఉద్యోగం పీకేసినప్పుడు మరీ ఇదిగా ఫీలవలేదు. బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం ఎక్కడైనా ఉన్నవే. నా అవసరాల మాటంటారా, మా ఆవిడ పోయింది. బోల్డంత సంపాదించేయాలన్న తపన ఏమీ లేదు నాకు. సంపాదించి దాచుకున్నది నాకు సరిపోతుందనుకోండి. డబ్బు గురించి కాదు కానీ, ప్రజలతో కలిసిమెలిసి తిరిగే అవకాశం పోయిందేనన్న బాధ మాత్రం ఉండిపోయింది. చిన్న ఊళ్లో బాంక్ ఉద్యోగికి చాలా ప్రాముఖ్యత ఉంటుంది. జబ్బుకి డాక్టరు ఎలాటివాడో, డబ్బుకి బాంకు వాళ్లు అలాటివాళ్లు. ఎవరికో ఏదో ఇబ్బంది వస్తుంది - కూతురు పురుటికి వచ్చింది, కొడుకు చదువుకి డబ్బు పంపాలి, విత్తనాలకు డబ్బు కావాలి - ఇలా ఎన్నో ఉంటాయి. చేతనైనంతవరకు వాళ్లకు సహాయం చేసేవాణ్ని. రూల్సన్నీ కంఠోపాఠం కాబట్టి వాటిలో ఉన్న లోటుపాట్లు తెలుసు కాబట్టి, కాస్త అటూ ఇటూ అడ్జస్ట్ చేసి వాళ్లకు సాయపడేవాణ్ని. లంచాలు పట్టేవాణ్ననుకొనేరు. ఛ, ఛ, అదేం లేదు. బాంక్‌కూ నష్టం ఉండేది కాదు. వాళ్లకూ అవసరం తీరేది. ఆ అవకాశం ఇక పోయింది.

"అయినా ఇప్పుడు బాంకుల్లో ఆ పద్ధతంతా మారిపోతోంది కాబట్టే ఉద్యోగం తీసేసినా బాధ పడలేదు. ఈ రోజుల్లో ఈ కంప్యూటరైజేషన్ వల్ల రూల్స్ సడలించే వెసులుబాటుకి ఏ మాత్రం అవకాశం లేకుండా చేసారు. అసలు కస్టమర్‌ని బాంక్‌లో అడుగుపెట్టనిస్తే కదా, 'మా వద్దకు రాకుండానే డబ్బు తీసుకోవచ్చు' అంటూ ప్రకటనలొకటీ. మనిషి బాంక్ స్టాఫ్‌తో కలిసి, కష్టం, సుఖం చెప్పుకున్ననాడే కదా అతని గురించి అంచనా వేయగలిగేదీ, అతనికి ఏదైనా సాయపడగలిగేదీ. కాగితం మీద అంకెలు చూసి బాంకింగ్ చేసే రోజుల్లోకి వచ్చాం. హ్యూమన్ టచ్ అనేదే లేనప్పుడు మానవత అనేది ఎక్కడనుంచి వస్తుంది? ఎందుకీ యంత్రాలు? మనుష్యుల ఉద్యోగాలు పీకేసి మిగిల్చిన డబ్బు అడ్వర్టయిజ్‌మెంట్ల

మీద తగలేస్తున్నారు. అదీ నా బాధ? అసలు ఓ అడ్వర్టయిజ్‌మెంటు చూసాకనే నాకు కథలు రాయాలన్న ఐడియా వచ్చింది." అన్నాడు శీతారామయ్య.

"మీ కథల ద్వారా వాళ్లని హడలగొట్టేరు. ఒక విధంగా మీ తెలివిని మీరు ఉపయోగించుకున్నట్టే అయింది. పోన్లెండి, నాకేం బాధ లేదు. వాళ్లని విడిచిపెట్టకండి. మూడో మార్గం తెలుసుకోడానికి వాళ్లు ఎంత డబ్బైనా ఇచ్చేట్టున్నారు. ఆ డబ్బు వాళ్ల జేబులోది కాదుగా, డిపాజిటర్ల డబ్బేగా."

"డబ్బు గురించి కాదమ్మా, వాళ్ల కళ్లు తెరిపించాలనే నా ప్రయత్నమంతా, మనిషి కనిపెట్టిన యంత్రాన్ని ఓడించడం మనిషికే సాధ్యమని నిరూపించడమే నా లక్ష్యం. మనిషిని విస్మరిస్తే, అతని ప్రయోజనాలను కాలరాస్తే విలయం తప్పదని వాళ్లు ఒప్పుకుంటే నా కది చాలు" అని శాంతంగా అంటూనే ఆమెను మీటింగుకి బయలుదేరతీశాడు శీతారామయ్య.

గుంటనక్క ముసలాయన నేతృత్వంలో బాంకర్స్ అసోసియేషన్ వాళ్లు, వాళ్ల చుట్టూ డజను మంది న్యాయవాదులు కనబడ్డారు మీటింగులో. అత్యుత్సాహంగా ఉన్న ఓ కుర్రలాయరు "శీతారామయ్యా, నువ్వనే ఆ విధానాలు రెండూ చట్ట విరుద్ధమని నీకీ పాటికే తెలిసే వుంటుంది. అయినా నీ కథలకు డబ్బు ఇచ్చాం..." అని మొదలెట్టబోతూంటే శీతారామయ్య అడ్డుకున్నాడు. "చూడు నాయనా, మా బాంక్ రూల్స్ ఫ్రేమ్ చేసినప్పుడు నేను లా డిపార్ట్‌మెంట్‌లోనే పనిచేసాను. ఇప్పుడు కూడా కొత్త బాంక్‌లు పెడదామనుకున్నప్పుడు నా సలహా సంప్రదింపులకు వస్తూ ఉంటారు. నువ్వు కూడా చట్టం తెలుసుకుని వచ్చాక మనం ఇద్దరం కూర్చుని మాట్లాడితే మంచిది. కన్ఫ్యూజన్ ఉండదు." అన్నాడు. దాంతో అక్కడున్న వాళ్లందరికీ శీతారామయ్య తడాఖా ఏమిటో కాస్త బోధపడింది.

జవాబుగా కుర్రలాయరు నోరు తెరవబోతుండగానే అతని సీనియర్ చివాట్లేసాడు, "నువ్వూరుకో, సుధాకర్" అంటూ. "చూడండి శీతారామయ్య గారూ, కుర్రాడు తెలీక ఏదో మాట్లాడాడు. సంగతేమిటంటే, మీరు రాసిన రెండు విధానాలూ చట్టబద్ధమైనవో, కావో మాకే సరిగ్గా తెలియలేదు. ఆ పద్ధతిలో టెస్ట్ చేసి కోర్టు కెళ్లి ఏమవుతుందో చూడడం పెద్ద తలకాయనొప్పి. ఈ లోపుగా ఆ విధానం ప్రజల్లోకి వెళితే చాలా చిక్కులొస్తాయి. అది జరగక్కుండా చూస్తానని మీరు హామీ ఇస్తారేమో కనుక్కుందామని పిలిచాం." అన్నాడు చాలా తెలివితేటలుగా.

"మీరా కథలు కొనుక్కొన్నారు. అచ్చు వేయించకపోతే అది మీ ఇష్టం. నా మట్టుకు నేను ఆ రెండు విధానాలు ఉపయోగించి కథలు రాయనని హామీ ఇస్తున్నాను. సరేనా?" అన్నాడు శీతారామయ్య.


"వాటి సంగతి సరే, మూడో విధానం మాటేమిటి? మొదటి రెండిట్లా అది కూడా బాంక్ దోపిడీ చేసే మరో దిక్కుమాలిన ఐడియాయేనా?" అంటూ అరిచాడు గుంటనక్క ముసలాయన.

శీతారామయ్య నొచ్చుకున్నట్టు కనబడలేదు. "సుజాత గారికి కూడా చెప్పాను నేను, టైటిల్ ఆకర్షణీయంగా ఉండాలని అలా పెట్టడం జరిగింది కానీ అదంతా నిజమైన దోపిడీ కాదు. ఆ పద్ధతులు నీతివంతమైనవి కాకపోవచ్చు కానీ చట్టవిరుద్ధమైనవి కూడా కావు. మూడో విధానమంటారా, అది పూర్తిగా చట్టబద్ధమైనది. మీకే సందేహమూ అక్కరలేదు."

మీటింగులో ఉన్న బాంకర్సందరూ ఉలిక్కిపడి ఒక్కసారిగా మాట్లాడడం మొదలుపెట్టారు. గుంటనక్క ముసలాయన నిలబడి చెయ్యెత్తి వాళ్లందరినీ ఆపి, "అంటే మొదటి రెండు విధానాలంత ఇదిగానూ మూడోది కూడా పనిచేస్తుందంటావా?" అన్నాడు.

"నిస్సందేహంగా" అని జవాబిచ్చాడు శీతారామయ్య నిబ్బరంగా.

"అలా అయితే ఇంకో పంద రూపాయలు పెట్టి అది కూడా మేం కొనేస్తాం. నువ్వు కథ రాయనక్కర్లేదు కూడా. ఇంకు ఖర్చు మిగులు నీకు. ఆ కథ, ఆ దోపిడీ విధానం ఏమిటో నోటితో చెప్పేసేయి మాకు చాలు. అంతేకాదు జన్మలో మళ్లీ కథల జోలికి పోనని మాట ఇస్తే వెయ్యి రూపాయలిస్తాం. హార్డ్‌కాష్, కాష్ డౌన్." అన్నాడు గుంటనక్క. తన ఔదార్యానికి తానే మూర్ఛపడిపోయినట్టున్నాడు; కుర్చీలో కూలబడ్డాడు.



శీతారామయ్య తొణకలేదు, బెణకలేదు. "నేనో స్టాంపు కాగితం రాయించి తెచ్చాను. మీ లాయర్ గారికి కూడా చూపించండి. దాని ప్రకారం నేను కథలు రాయకుండా ఉండడానికి గాను మీ బాంకర్స్ అసోసియేషన్ వాళ్లు ఏడాదికి 25,000 రూపాయలు నేను బతికున్నంత కాలం నాకూ, నా తదనంతరం నేను చెప్పిన ధర్మసంస్థలకూ ఇవ్వాలి..." అని అతను అంటూండగానే హాలులో పెద్ద రగడ చెలరేగింది.

సుజాత హృదయం ఎగిరిగంతులేసింది. వాళ్ల ఎడిటర్ చిరునవ్వు అణుచుకోవడానికి అవస్థ పడుతున్నాడు. సద్దుమణిగాక శీతారామయ్య మళ్లీ మాట్లాడాడు, "ఒకే ఒక్క కథకు అంత డబ్బు ఇవ్వటం మీకు నచ్చదేమోననుకుంటాను. అందుకనే ఇంకో ప్రతిపాదన పెడుతున్నాను. ఆ జీతానికి నన్ను మీ అసోసియేషన్‌కి హ్యూమన్ రిలేషన్స్ కన్సల్టెంట్‌గా నియమించండి. ఉద్యోగ బాధ్యతలు నెత్తిన పడ్డప్పుడు కథలు రాసే తీరికెక్కడుంటుంది?"

కుర్రలాయరు లేచి అరవడం మొదలెట్టాడు "ఆ మూడో విధానం సంగతేమిటి? ఆ అగ్రిమెంటులో దాని గురించి రాసి వుందా? అది చెప్పకపోతే మేము దేనిమీదా సంతకాలు పెట్టం."

"అగ్రిమెంటు మీద మీరు సంతకాలు పెట్టిన మరుక్షణం నేను దాని గురించి చెప్పేస్తాను." అన్నాడు శీతారామయ్య.

శీతారామయ్యను బైటకు పంపి కాస్సేపు తర్జనభర్జనలు అయ్యేక అతన్ని లోపలికి పిలిచారు అసోసియేషన్ వాళ్లు. అందరి మొహాలు వేలాడి ఉన్నాయి. ఈసారి ప్రతాపరావు గొంతు సవరించుకున్నాడు - "శీతారామయ్య గారూ, హ్యూమన్ రిలేషన్స్‌లో కన్సల్టెంటు కావాలని మేము ఎప్పణ్నుంచో అనుకుంటున్నాం. మీ ప్రతిపాదన మాకు నచ్చింది. నేనూ, మా ప్రెసిడెంటు గారూ అగ్రిమెంటు మీద సంతకం పెట్టాం. మీరూ సంతకం పెట్టి మాకో కాపీ ఇస్తే చాలు." అంటూ స్టాంపు కాగితం శీతారామయ్య చేతికిచ్చాడు.

అతను ఆ కాగితం అందుకుంటూండగానే కుర్రలాయరు మళ్లీ అరిచాడు. "ఆ మూడో మెథడ్ ఏమిటో చెప్పమనండి." అంటూ.

"అవునవును, చెప్పాలి కదూ" అంటూనే శీతారామయ్య సంతకం పెట్టి ఓ కాపీ ప్రతాపరావు చేతికిచ్చాడు. పెన్ కాప్ మూసి జేబులో పెట్టుకుంటూ "నిజం చెప్పాలంటే అది చాలా సింపుల్. బాంక్‌ను దోపిడీ చేసే మూడో మార్గం ఏమిటన్నదేగా మీరు తెలుసుకోవాలనుకుంటున్నది. ఆ మెథడ్ నెంబర్ త్రీ ఇదే!" అన్నాడు.

సుజాత చప్పట్లు కొట్టకుండా ఉండలేకపోయింది.